శ్రీరామదూతం.. నమో నమామి

హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనేక ఆలయాల్లో వేడుకలను పురస్కరించుకుని అన్నసమారాధనలు జరిగాయి. ఈ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- వాడవాడలా హనుమజ్జయంతి
- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రజలు



చోడవరంలో వేంచేసిన ఆంజనేయస్వామి



అంకుపాలెం హనుమాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : అభయాంజనేయస్వామి జయంతి సందర్భంగా అన్ని గ్రామాల్లో శ్రీరామదూతకు విశేష పూజలు నిర్వహించారు. ప్రఖ్యాత పురాతన దేవాలయమైన చోడవరం శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. వెంకన్నపాలెం, గాంధీ గ్రామం, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, గంధవరం, ముద్దుర్తి, లక్ష్మీపురం, దామునాపల్లి, ఖండిపల్లి, గవరవరం, లక్కవరం, జుత్తాడ, గజపతినగరం, అంబేరుపురం, గోవాడ, నర్సాపురం, చాకిపల్లి, పీఏస్‌పేట గ్రామాల్లో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. సామూహిక అన్నసమారాధనలు నిర్వహించారు. అంకుపాలెంలో జరిగిన స్వామివారి జయంతి వేడుకల్లో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొని పూజలు చేశారు.

రోలుగుంటలో..

రోలుగుంట : రోలుగుంట, బుచ్చింపేట, కొమరవోలు గ్రామాల్లో హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పలు గ్రామాల్లో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : హనుమాన్ జయంతి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మండలంలోని పైడిపాల, పెద్దిపాలెం, తామరం, కొండల అగ్రహారం, బుచ్చన్నపాలెం, బి.ఎస్.పేట, దాలింపేట, వజ్రగడ, లచ్చన్నపాలెం తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మధ్యాహ్నం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు..

బుచ్చెయ్యపేట : శనివారం ఉదయం నుండి రాత్రి వరకు బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజు పేట, మంగళాపురం, గున్నెంపూడి, రాజాం, తురకలపూడి, సీతయ్యపేట, దిబ్బిడి, కొండపాలెం, కేపీ అగ్రహారం, పెదమదీన తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్న సమారాధన చేసి రాత్రికి ప్రత్యేక భజనలు, కీర్తనలు చేపట్టారు.

అంజనీపుత్రునకు ప్రత్యేక పూజలు..

గొలుగొండ: ఏఎల్‌పురం, గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మల, లింగంపేట, చోద్యం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పూజా కార్యక్రమాల అనంతరం అన్న సమారాధనలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి..

దేవరాపల్లి : రైవాడ పంచాయతీ శివారు కాలనీలో కార్యసిద్ధి హనుమాన్, కొల్లివానిపాలెం, తిమిరాం, మామిడిపల్లి, ములకలాపల్లి, తారువ, కాశీపురం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లివానిపాలెంలో పూజల అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శన, భజన కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

విజయాంజనేయ స్వామికి విశేష పూజలు..

మాడుగుల : మండల కేంద్రం గాంధీ పార్కు వద్ద గల విజయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి కుంకుమ పూజలు, సింధూర పూజలు, తమలపాకలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమములో రాఖీ శ్రీను తదితరులు పాల్గొన్నారు. మాడుగులలో మోదమాంబ కాలనీ, హైస్కూలు కాలనీ, జగ్గన్న చావిడి ప్రాంతాల్లో గల ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయాలకు హనుమజ్జయంతి శోభ..

మాడుగుల రూరల్: కె.జె.పురం పాల సొసైటీ వద్ద గల అభయాంజనేయ స్వామికి ఉదయం నుంచి పూజలు, సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వంటర్లపాలెం, ముకుందపురం, ఎం. కోటపాడు, వీరవల్లి అగ్రహారం, జి. అగ్రహారం, ఎం. కోడూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రోలుగుంటలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



విజయరామరాజుపేటలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ఏఎల్‌పురంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



మాడుగులలో విజయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



రైవాడలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



తిమిరాంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ములకలాపల్లిలో ఆంజనేయ స్వామికి భక్తుల పూజలు

క్లుప్తంగా

కూలిన కొబ్బరి చెట్టు.. తప్పిన ప్రమాదం



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కూలిన కొబ్బరి చెట్టు

రోలుగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం వేకువ జామున ఉరుములు, మెరుపుల అదురుకు కొబ్బరి చెట్టు కూలి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడ పని చేసే హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, మండల రిసోర్స్ వనరుల కేంద్రం, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు విధులు ముగించుకుని సాయంత్రం సొంత గ్రామాలకు వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిని తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడి కొబ్బరి చెట్టు కూలిపోయింది.

చల్లబడ్డ వాతావరణం



ముకుందపురంలో వరినారు మడిలో చేరిన నీరు

మాడుగుల రూరల్ : ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజానీకం శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో సేదదీరారు. శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి భూమి చల్లబడింది. రైతులు వరినారు మడులను సిద్ధం చేస్తున్నారు.

ఎర్రమ్మనాయుడుకు ఘన నివాళి



ఎర్రమ్మనాయుడు స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పని చేసిన మాజీ ఎంపీపీ లగుడు ఎర్రమ్మనాయుడు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ తెలిపారు. ఎర్రమ్మ నాయుడు వర్ధంతి సందర్భంగా ఏఎల్‌పురంలో ఆయన స్థూపం వద్ద స్థానికులు, పార్టీ కార్యకర్తలు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ పేదల కోసం అనేక ఉద్యమాలు చేసిన ఆయన ఆశయాలు కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, గురుబాబు, ఎల్‌వీ రమణ. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు పంటకు జీవం పోసిన వర్షం



కనుచూపు మేరంతా పచ్చగా కన్పిస్తున్న నువ్వు పంట

నాతవరం: ఆకాల వర్షం కురిసి నువ్వు పంటకు జీవం పోసినట్లయింది. మండలంలో ఆరు తడి పంటల సాగులో భాగంగా ఈ ఏడాది రైతులు 890 ఎకరాల్లో నువ్వు పంట, 1250 ఎకరాల్లో మినుములు, 420 ఎకరాల్లో పెసర పంట సాగు చేస్తున్నారు. ఇటీవల కాసిన ఎండకు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందేవారు. అలాంటి సమయంలో ప్రకృతి కరుణించి శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అంత వరకు పంట పోలాల్లో ఎండిపోయి కన్పించిన నువ్వు చేను కురిసిన వర్షానికి మృదువుగా మారి, కనుచూపు మేరంతా పచ్చగా కన్పిస్తోంది. దీంతో దిగాలుగా ఉన్న రైతుల ముఖాల్లో ఆనందం కన్పిస్తోంది. ఆశించిన విధంగా ఆరుతడి పంటలు దిగుబడులని స్థాయని రైతులు ఆశిస్తున్నారు.

మలేరియాపై అవగాహన



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నిర్మల, సిబ్బంది

కె.కోటపాడు : గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా అందరూ బాధ్యత తీసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శనివారం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమ కాటు ద్వారా మలేరియా సోకుతుందని ఆమె తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, రుబ్బురోళ్లు, బోర్ల పరిసరాల్లో నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది తెలిపే జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ డీఏస్ఎన్ రాజు, ల్యాబ్ టెక్నీషియన్ మాధురి, ఎంఎల్‌హెచ్‌పీ ఉమ, ఏఎన్ఎం సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా అందని తాగునీరు

మాకవరపాలెం : నాలుగు రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లచ్చన్నపాలెం సర్పానదిలో ఉన్న భారీ ప్రాజెక్టు నుంచి మాకవరపాలెంతో పాటు పలు గ్రామాలకు నిత్యం తాగునీరు అందించాల్సి ఉంది. అయితే ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసే మోటార్లు వోల్టేజీ హెచ్చుతగ్గుల కారణంగా కాలిపోయాయి. దీంతో బుధవారం నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోనూ నాలుగు రోజులుగా తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు నీటితో పని లేకుండా ట్యాంకుకు నీటిని ఎక్కించేందుకు స్థానికంగా ఉన్న బోరు నిర్వహణలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు నీరు అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీవో చంద్రరావును సంప్రదించగా బోరులో నీరు అడుగంటిన కారణంగా మోటారు పైపును పెంచారని, ఇంతలో కుళాయిలకు నీరు వెళ్లే పైపులైన్ రంధ్రం పడిందన్నారు. దీనికి మరమ్మతులు పూర్తి చేసి నీటిని అందిస్తామన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

మాకవరపాలెం : రాయితీపై పంపిణీ చేసే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో చిరంజీవి తెలిపారు. జనుము, జీలుగు విత్తనాలు అన్ని రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డులు తీసుకెళ్లి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్ : ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముందుగా కాపులకు తూర్పు కాపు సర్టిఫికెట్ల మంజూరు అంశంలో రసాభాసా చోటు చేసుకుంది. ఈ అంశంపై మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీపీ రాజారామ్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమస్య గురించి సభలో సుమారు గంట సేపు సభ్యుల వాదనలు నడిచాయి. మాడుగుల ఎంపీటీసీ సభ్యురాలు పోలిమేర విజయలక్ష్మి సర్ది చెప్పడంతో వాదనలు సద్దుమణిగాయి. స్టాంపు డ్యూటీ బకాయిలు గ్రామ పంచాయతీలకు జమ కాలేదని ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు సంబంధిత అధికారి దృష్టికి తీసుకొచ్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెవెన్యూ స్టాంపులు విక్రయించడం లేదని, బయటి దుకాణాల్లో ఒక్కో స్టాంప్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని పొంగలిపాక ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు పేర్కొన్నారు. అలాగే సహకార సంఘాల రుణాల మంజూరులో సమస్యలు, మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టల అంశం, వ్యవసాయ, ఉద్యానవన శాఖకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి. సమావేశంలో ఉపాధి హామీ పథకం, పశువైద్యం, విద్య, స్త్రీ శిశు సంక్షేమం, విద్యుత్, గృహ నిర్మాణం, బీసీ సంక్షేమ శాఖ అధికారుతో సమీక్షించారు. స్థానిక ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదరావు, తహశీల్దార్ టి. సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు తదితరులు హాజరయ్యారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం : ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు సహకరించాలని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా అనేక మందిని బైండవర్ చేశామని హెచ్చరించారు. ఎవరైనా బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి గొడవలు చేసినా, అల్లర్లకు పాల్పడినా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, లేకుంటే జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. బాణసంచా కాల్చరాదని తెలిపారు. సోషల్ మీడియా గ్రూపుల్లో మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు పెట్టరాదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేయకుండా గ్రూపు అడ్మిన్లు ముందు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాయకులు రౌడీషీటర్లను ప్రోత్సహించకూడదన్నారు. డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, టౌన్ సీఐ కాంతికుమార్, రూరల్ సీఐ హరి, ఎస్ఐలు సుధాకర్, ఉమామహేశ్వరరావు, భీమరాజు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంతా సంయమనం పాటించాలి..

మాడుగుల రూరల్ : శనివారం సాయంత్రం మాడుగుల శ్రీ కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులతో జిల్లా ఎస్పీ కె. వి. మురళీకృష్ణ అవగాహన సదస్సు నిర్వహించారు. కౌంటింగ్‌కు ముందు గాని, తర్వాత కాని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటామని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుదని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు బేఖతారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్. అప్పలరాజు, కె. కోటపాటు సీఐ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ద్విచక్ర వాహనాల పంపిణీ



టీవీఎస్ వాహనాతో మత్స్యకారులు

అచ్యుతాపురం : మత్స్యకారులకు అండగా ఉంటామని రామ్ కీ ఫౌండేషన్ ఎం.వి. రామిరెడ్డి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవ వద్ద నిర్వహించిన రీ సస్టైయినబులిటీ లిమిటెడ్ సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 మంది మత్స్యకారులకు 16 టీవీఎస్ ద్విచక్ర వాహనాలు అందజేశారు. వలలు దాచుకునేందుకు నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. రీ సస్టైయిన్‌బులిటీ జనరల్ మేనేజర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ 300 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్న కొండకర్ల, వాడ్రాపల్లి ప్రాంతాల్లో సస్టైయిన్‌బులిటీ లిమిటెడ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. శ్రీకాంత్, మహేంద్ర బాబు, శ్రీనివాసరెడ్డి, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు



వడ్డాదిలో రాంబాబును అభినందిస్తున్న పలు గ్రామాల నాయకులు

బుచ్చెయ్యపేట : ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు మాత్రం వైఎస్సార్‌సీపీకే మద్దతు పలికారని, 9వ తేదీన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. శనివారం వడ్డాదిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చోడవరం అసెంబ్లీ అభ్యర్థి కరణం ధర్మశ్రీకి పోలైన ఓట్లపై ఆయన 35 పంచాయతీల నాయకులతో సమీక్షించారు. సుమారు నాలుగు వేల ఓట్లతో టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుపై ధర్మశ్రీ విజయం సాధిస్తారని తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఓటమిని తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు దాడులకు పాల్పడవచ్చని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు దూరంగా ఉండాలని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లపు విజయ్‌కుమార్, కోవెల ఈశ్వరరావు, గోపిశెట్టి శ్రీను, ఎల్లపు గోవింద, పినపోలు రామునాయుడు, గొలజాన శ్రీను, ముచ్చకర్ల శ్రీను, బోయిన నారాయణమూర్తి, గుడాల ఆనంద్, పెద్దాడ నాయుడు, గొంపా అప్పారావు, రాజాం నాయుడు, జగ్గు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ



గెలుపొందిన నిర్వాహకులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర



కె.కోటపాడులో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

నర్సీపట్నం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఒక రోజు తరగతులు నిర్వహించారు. విద్యాశాఖాధికారులు సీహెచ్ తలుపులు, జీవీఎస్ నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించటంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల పాత్ర కీలకమన్నారు. రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భోజనం తయారీలో ప్రతిభ కనబరిచిన నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి జెడ్పీ హైస్కూల్ పెదబొడ్డేపల్లి, ద్వితీయ బహుమతి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వేములపూడి, తృతీయ బహుమతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నీలంపేట నిర్వాహకులకు వచ్చింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ప్రసన్న, డాటా ఎంట్రీ ఆపరేటర్ పట్నాల సతీష్, జిల్లా అబ్జర్వర్ హేమచంద్ర, సీఆర్‌పీలు పూడి వెంకట్రావు, లోకేష్, రామలక్ష్మి, ధారలక్ష్మి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి..

కె.కోటపాడు : ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు అన్నారు. కె.కోటపాడు మండలంలో గల 51 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని కె.కోటపాడు హైస్కూల్లో ఇచ్చారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవడంతో పాటు వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రుచికరమైన ఆహారం తయారు చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపకురాలు మహాలక్ష్మి, ఎంఈవో 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు సూర్రెడ్డి శ్రీనివాస్, పోతల నాయుడు, నరిసింహమూర్తి, ఎండీఎం రీసోర్స్‌పర్సన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలుకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

రోలుగుంట : శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామాల్లో 104 సెక్షన్ అమల్లో ఉందని, ఫలితాలపై పందాలు కాయడం నిషేధమని ఎస్ఐ సురేష్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫలితాలు వెలువడిన తర్వాత బాంబులు కాల్చడం, ఘర్షణలకు దిగటం చేస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని పార్టీల వారు శాంతి భద్రతల పరిరక్షణకు, ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామ వీధుల్లో మైకు ద్వారా నిబంధనలు పాటించాలని కోరుతూ ప్రచారం చేశారు.

చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు



బాలలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

తుమ్మపాల : నేటి బాలలే రేపటి పౌరులని, బాలలు సమాజం, దేశం పట్ల గౌరవం పెరిగే విధంగా తీర్చిదిద్దాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. చినరాజుపేట సాంబశివ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన భారత జాతీయ జెండా చిత్రలేఖనం పోటీలలో ఆయనతో పాటు ప్రముఖ శిల్పి కళాకారులు పండూరి సత్యనారాయణ బాలలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ బాలలకు విద్యతో పాటు సమాజంలో బాధ్యతలపై కూడా అవగాహన చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలలను ప్రోత్సహించేందుకు చేపట్టిన పోటీల్లో 35 మంది బాలలు హాజరై ప్రతిభ కనబరిచారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, ఉజ్జి సత్యనారాయణ పాల్గొన్నారు.